క్లుప్తంగా

డాక్టరేట్ ప్రదానం


నిర్మల

నెల్లూరు (టౌన్): సంతపేటకు చెందిన కొటారి నిర్మలకు డాక్టరేట్ లభించింది. వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో అసోసియేట్ ప్రొఫెసర్ ఉషారాణి పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఈ క్రమంలో డాక్టరేట్‌ను ఎస్వీ వర్సిటీ ప్రదానం చేసింది.

ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమ పరిశీలన



నెల్లూరు(అర్బన్): మలేరియా, డెంగీ లాంటి కీటక జనిత వ్యాధులను నియంత్రించేందుకు గానూ నిర్వహిస్తున్న ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమాలను మలేరియా నివారణ సహాయాధికారి నాగార్జునరావు పరిశీలించారు. చంద్రమౌళీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలోని కొండాయపాళెం గేట్, స్నేహనగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు వెళ్లి అవగాహన కల్పించారు. వైద్య శాఖ సిబ్బంది జయరాములు, శ్రీనివాసులురెడ్డి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నగదు లెక్కలు తెలియజేయాలని వినతి


కమిషనర్‌కు వినతిపత్రమిస్తున్న ప్రమీలమ్మ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీకి సంబంధించిన నగదు లెక్కలను చూపాలని 16వ వార్డు కౌన్సిలర్ బిట్రగుంట ప్రమీలమ్మ కోరారు. ఈ మేరకు కమిషనర్ బాలకృష్ణకు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేసిన అనంతరం ఆమె మాట్లాడారు. నగర పంచాయతీకి సాధారణ నిధులు జనవరి నుంచి ఎంత జమయ్యాయి.. వివిధ కాంప్లెక్స్‌లకు సంబంధించిన వేలంలో వచ్చిన ఆదాయ వివరాలను తెలియజేయాలని కోరారు. శనివారం నిర్వహించనున్న నగర పంచాయతీ సర్వసభ్య సమావేశంలో వీటిని తెలియజేయాలని విన్నవించారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు పుస్తకాల పంపిణీ



కొడవలూరు: మండలంలోని రామన్నపాళెం అంగన్‌వాడీ కేంద్రం – 3లో ఐసీడీఎస్ కొడవలూరు సెక్టార్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. సెక్టార్ పరిధిలోని 30 అంగన్‌వాడీ కేంద్రాలకు పీపీ – 1, 2 పుస్తకాలను సూపర్‌వైజర్ నిర్మల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎర్లీ చైల్డ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలను రోజూ నిర్వహించి పుస్తకాలను పిల్లలతో రాయించాలని కోరారు.

సమస్యలపై క్షేత్ర సందర్శన


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న సుబ్బారావు

కొడవలూరు: మండలంలోని రామన్నపాళెంలో ఎంపీడీఓ వెంకటసుబ్బారావు క్షేత్ర సందర్శనను శుక్రవారం జరిపి గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ పారిశుధ్య సిబ్బంది పనితీరుపై ఇంటింటికీ వెళ్లి ఆరాతీశారు. స్థానిక ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకోవడంతో పాటు పంచాయతీ సిబ్బంది పనితీరును పరిశీలించనున్నానని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి సురేష్‌కుమార్, కాకి శ్రీనివాసులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం

ఇందుకూరుపేట: పక్కా గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు బిల్లులను కూటమి ప్రభుత్వం చెల్లిస్తోందానని రావూరు సర్పంచ్ ఉడతా వెంకటశేషయ్య ప్రశ్నించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ గండ్లశంకరయ్య, ఎంపీడీఓ నాగేంద్రబాబు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఇళ్లకు బిల్లులను చెల్లిస్తున్నారని గృహ నిర్మాణ శాఖ ఏఈ సమాధానమిచ్చారు. ఆర్థిక సంవత్సరంలో మండల పరిషత్‌కు ఎంత నిధులొచ్చాయి.. ఏయే పనులు చేశారు.. ఎన్నింటిని పూర్తి చేశారు.. తదితర వివరాలను తెలియజేసేలా సమావేశాన్ని నిర్వహించాలని సర్పంచ్ కోరారు. డిప్యూటీ తహసీల్దార్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి


ఆనం విజయకుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న నేతలు

నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నానని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. చింతారెడ్డిపాళెంలోని తన నివాసంలో పార్టీ 41వ డివిజన్ నేతలు, కార్యకర్తలతో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక నియోజకవర్గంలో భయానక వాతావరణం నెలకొందని ఆరోపించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానాన్ని కల్పిస్తామని చెప్పారు. పార్టీ శ్రేణులకు నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు. అనంతరం పార్టీ డివిజన్ ఇన్‌చార్జిగా శ్రీనివాసులును నియమించారు. ఆయన్ను పలువురు సత్కరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాసరావు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, నేతలు ప్రదీప్‌రెడ్డి, దాసరి రాజేష్, శివారెడ్డి, వరప్రసాద్, ప్రభాకర్, మస్తానయ్య, చిన్నా, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

⇨ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డిని చింతారెడ్డిపాళెంలోని ఆయన నివాసంలో మైనార్టీ నేతలు కలిశారు. ఈ సందర్భంగా మొహర్రం శుభాకాంక్షలను ఆయన తెలియజేశారు. రాష్ట్ర మైనార్టీ అధికార ప్రతినిధి రవూఫ్, సంచార జాతుల విభాగ రాష్ట్ర అధ్యక్షుడు షాకీర్‌బాబా, పార్టీ డివిజన్ ఇన్‌చార్జీలు ఖాదర్‌బాషా, ముజఫర్, అబ్దుల్ అలీమ్, నేతలు జిలానీ, జాహిద్, అన్వర్, జావీద్, రఫీ, షఫీ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు అంగన్‌వాడీలు సన్నద్ధమవ్వాలి


మాట్లాడుతున్న రెహనాబేగం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సమస్యల పరిష్కారానికి గానూ పోరాటాలకు అంగన్‌వాడీ కార్మికులు సిద్ధపడాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రెహనాబేగం పిలుపునిచ్చారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో గల జక్కా వెంకయ్య మెమోరియల్ హాల్లో శుక్రవారం నిర్వహించిన అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ మహాసభలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీలను ప్రభుత్వోద్యోగులుగా చూపుతూ ప్రభుత్వ పథకాలను అందించడంలేదని ఆరోపించారు. గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జూలై తొమ్మిదిన నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం 20 మందితో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా రజని, కామాక్షి, ట్రెజరర్‌గా మల్లెమ్మ ఎన్నికయ్యారు. సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, నాగేశ్వరరావు, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుజాతమ్మ, ఐద్వా జిల్లా కార్యదర్శి మస్తానీబీ, నగరాధ్యక్ష, కార్యదర్శులు పద్మ, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం శుభాకాంక్షలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) / నెల్లూరు(బృందావనం): మొహర్రం మాస ప్రారంభాన్ని పురస్కరించుకొని ముస్లింలకు శుభాకాంక్షలను మాజీ ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు పార్లమెంట్ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం వారు వేర్వేరు ప్రకటనలను విడుదల చేశారు.

యువకుడి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): యువకుడు అదృశ్యమైన ఘటనపై కేసును చిన్నబజార్ పోలీసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మూలాపేటలోని చేపల మార్కెట్ సమీపంలో నివాసం ఉంటున్న బహదూర్‌కు ముగ్గురు కుమారులు, కుమార్తె సంతానం. మానసికంగా అనారోగ్యంతో బాధపడుతున్న మూడో కుమారుడు గోవింద్ హిమేర్ ఇంట్లోంచి ఈ నెల 19న బయటకెళ్లారు. అప్పటి నుంచి ఆయన జాడ తెలియరాలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యను వంచించి రెండో వివాహం

నెల్లూరు(క్రైమ్): భార్యను వంచించి మరో మహిళను వివాహం చేసుకున్న వ్యక్తిపై కేసును వేదాయపాళెం పోలీసులు శుక్రవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఒంటరిగా ఉంటున్న పోలీస్ కాలనీకి చెందిన ఓ మహిళకు నగరానికి చెందిన బాబు మాయమాటలు చెప్పి పదేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. ఇటీవల ఆమెను దూరంగా పెట్టి మరో మహిళను వివాహమాడారు. విషయం తెలుసుకున్న బాధితురాలు అతని ఇంటి వద్దకెళ్లి నిలదీశారు. బాబు, అతని తల్లి, అక్కలు అవమానకరంగా మాట్లాడటమే కాకుండా దాడి చేశారు. మరోసారి ఇంటికొస్తే చంపుతామని బెదిరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పారిశుధ్య పనుల పర్యవేక్షణ

నెల్లూరు(బృందావనం): రొట్టెల పండగ సందర్భంగా బారాషహీద్ దర్గాలో చేపట్టిన పారిశుధ్య పనులను ఎంహెచ్‌ఓ చైతన్య పర్యవేక్షించారు. దర్గా ప్రాంగణం, పరిసరాల్లో ఏర్పాటు చేయనున్న దుకాణాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించొద్దని ఆదేశించారు. పారిశుధ్య పనుల నిర్వహణకు సంబంధించి దర్గాలో ఏడు జోన్లకు సంబంధించిన ఇన్‌స్పెక్టర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

విద్యుత్ భద్రతపై అవగాహన అవసరం


సమావేశానికి హాజరైన అధికారులు



మాట్లాడుతున్న విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ భద్రతపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ ఆదేశించారు. విద్యుత్ భద్రత వారోత్సవాలపై నగరంలోని విద్యుత్ భవన్‌లో అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. స్మార్ట్ ఎనర్జీ – సేవ్ నేషన్ అనే నినాదంతో కార్యక్రమాన్ని జూలై రెండు వరకు నిర్వహించనున్నామని చెప్పారు. అధునాతన సాంకేతిక బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్, ఎలక్ట్రికల్ వాహనాలకు చార్జింగ్ స్టేషన్లు, రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటులో భద్రత ప్రమాణాలకు ప్రాధాన్యమిస్తున్నామని పేర్కొన్నారు. నోడల్ ఆఫీసర్ శేషాద్రి బాలచంద్ర, ఈఈ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాండవ జనన వేడుక



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని ద్రౌపదీదేవి సమేత కృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా చప్పరోత్సవం, పాండవ జననాన్ని వేడుకగా శుక్రవారం జరిపారు. పూజా కార్యక్రమాలను దేవస్థాన ప్రధానార్చకుడు చక్రపాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. భగవద్గీత పఠనం, మహాభారత పురాణ కాలక్షేపం, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఉభయకర్తలుగా తన్నీరు వెంకటేశ్వర్లు, వెంకటసురేఖ దంపతులు వ్యవహరించారు. ఈఓ జానకి తదితరులు పాల్గొన్నారు.

తోపుడు బండి వితరణ



నెల్లూరు(బృందావనం): నిరుపేద వితంతువుకు తోపుడు బండిని కొండాయపాళెం రోడ్డులోని అబైడింగ్ హోప్ ట్రస్ట్ కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. ట్రస్ట్ చైర్మన్, విశ్రాంత ప్రిన్సిపల్ టైటస్ నిర్మల్‌కుమార్, జయప్రకాష్, డేవిడ్ లివింగ్‌స్టన్, క్రాంతికుమార్, వరలక్ష్మి, భవాని, రవీంద్ర, మరియమ్మ, శశిదేవి, రూత్, బాబు తదితరులు పాల్గొన్నారు.

గిరిజ సేవలు అభినందనీయం



నెల్లూరు(అర్బన్): నగరంలోని సర్వజన ఆస్పత్రిలో నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందుతున్న గిరిజ సేవలను ఆస్పత్రి సూపరింటెండెంట్ సిద్ధానాయక్ కొనియాడారు. శుక్రవారం నిర్వహించిన ఉద్యోగ విరమణ సభలో గిరిజ దంపతులను సత్కరించారు. ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చేమూరు రవికుమార్, మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతలు సతీష్, సందానీ, కమ్మిటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు కేసులను పరిష్కరించాలి


మాట్లాడుతున్న నందన్

నెల్లూరు(బృందావనం): నగరపాలక సంస్థ పరిధిలో కోర్టు కేసులు వేగవంతంగా పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ నందన్ పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు.

⇨ ఫ్లెక్సీలు, పోస్టర్ల ముద్రణ విషయంలో అనుమతులను పొందాలని కమిషనర్ చెప్పారు. ఈ మేరకు ఫ్లెక్స్, వాల్‌పోస్టర్ ప్రింటింగ్ అసోసియేషన్ నేతలతో సమావేశమయ్యారు. సిటీ ప్లానర్ హిమబిందు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వేణు తదితరులు పాల్గొన్నారు.

⇨ వార్డు సచివాలయ కార్యదర్శులు రేషనలైజేషన్ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ నందన్ ఒక ప్రకటనలో కోరారు. నెల్లూరు నగరపాలక సంస్థతో పాటు కావలి, సూళ్లూరుపేట, నాయుడుపేట, గూడూరు, ఆత్మకూరు, వెంకటగిరి, బుచ్చిరెడ్డిపాళెం, అల్లూరు మున్సిపాల్టీల్లో ఐదేళ్ల కాలం పూర్తి చేసుకున్న సచివాలయ కార్యదర్శులు ప్రక్రియలో పాల్గొనాలని సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరం, కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రేషనలైజేషన్ శనివారం ఉదయం పదింటికి జరగనుందని వివరించారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి, పార్టీ తిరుపతి ఇన్‌చార్జి భూమన అభినయ్‌రెడ్డిని పార్టీ రాష్ట్ర మహిళా విభాగ జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, జిల్లా అధ్యక్షురాలు బుర్రా మాధవి, నగరాధ్యక్షురాలు గంగవరం కోటేశ్వరమ్మ తిరుపతిలో మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా వీరిని సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

ఆటో కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలి


హాజరైన ఆటో కార్మికులు


మాట్లాడుతున్న మాదాల వెంకటేశ్వర్లు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సమస్యల సాధన కోసం ఆటో కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. వేదాయపాళెంలోని మన్సూర్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ఆటో వర్కర్స్ యూనియన్ నెల్లూరు రూరల్ మహాసభలో వారు మాట్లాడారు. ఈ – చలానా పేరుతో పోలీసులకు టార్గెట్లిచ్చి ఆటో కార్మికులను ప్రభుత్వం వేధిస్తోందని ఆరోపించారు. వాహనమిత్ర పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం 21 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పులిమి నరసింహారెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులుగా పెంచలయ్య, లవకుమార్, ఆఫీస్ బేరర్లుగా శ్యామ్‌సన్, షానవాజ్, జావీద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆటో కార్మిక సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజా, సురేష్, సీఐటీయూ రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు కొండా ప్రసాద్, పెంచలనరసయ్య, నేతలు సుధాకర్, ఖాజావలీ, సంపత్‌కుమార్, సతీష్, దాసు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను యంత్రాలతోనే శుభ్రపర్చాలి


వాహనాన్ని నడుపుతున్న నారాయణ

నెల్లూరు సిటీ: రోడ్లను యంత్రాలతోనే ఇక నుంచి శుభ్రపర్చాలని నిర్ణయించామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. ఏడో డివిజన్లోని స్టోన్‌హౌస్‌పేటలో స్వీపింగ్ మెషీన్ వాహనాన్ని శుక్రవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా నగరానికి 28 స్వీపింగ్ మెషీన్ వాహనాలను తెప్పించామని చెప్పారు. కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, తాళ్లపాక అనూరాధ, విజేతారెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బ్రహ్మం గుప్తా, నగరాధ్యక్షుడు మామిడాల మధు, కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్ ప్రారంభం



నెల్లూరు (పొగతోట): నగరంలోని జెడ్పీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈఓ మోహన్‌రావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలకు ఆదర్శంగా నిలవాలనే ఉద్దేశంతో జెడ్పీ కార్యాలయంలో 30 కేవీ వాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామని వివరించారు. ఈ ప్లాంట్ ఏర్పాటుతో ప్రతి నెలా రూ.40 వేలు ఆదా అవుతుందని చెప్పారు. మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో వీటిని ఏర్పాటు చేయాలని సూచించారు.

రాజరాజేశ్వరి సన్నిధిలో పూజలు





నెల్లూరు(బృందావనం): ఆషాఢమాస శుక్రవారాన్ని పురస్కరించుకొని నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి విశేష పూజలను శుక్రవారం నిర్వహించారు. రాహుకాల పూజలకు 37 మంది హాజరై.. అమ్మణ్ణికి చీర, జాకెట్టు, 108 నిమ్మకాయల మాలలను సమర్పించారు. వేదపారాయణం, సంధ్యామేళం, కుంభహారతులు, పల్లకిసేవను జరిపారు. ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

నేత్రదానం


అశోక్ (ఫైల్)

నెల్లూరు(అర్బన్): శెట్టిగుంటరోడ్డుకు చెందిన అశోక్ (27) రామచంద్రారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ క్రమంలో ఆయన నేత్రాలను జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు కుటుంబసభ్యులు వెంకటేశ్వర్లు, సుమన్, ప్రదీప్‌చంద్రారెడ్డి శుక్రవారం దానం చేశారు. వీటిని ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్ సేకరించారు. అనంతరం నేత్రదాన సర్టిఫికెట్‌ను అందజేశారు. నేత్రదానం చేయాలనుకునే వారు 99595 89321 నంబర్‌ను సంప్రదించాలని సునీల్ కోరారు.

సార్వత్రిక సమ్మె జయప్రదానికి పిలుపు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై తొమ్మిదిన నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ భారీ ర్యాలీని ఆటో కార్మికులు శుక్రవారం నిర్వహించారు. వేదాయపాళెం సెంటర్ నుంచి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి విగ్రహం వరకు ర్యాలీని ఆటో కార్మిక సంఘ నెల్లూరు రూరల్ కమిటీ ఆధ్వర్యంలో జరిపారు. సీఐటీయూ నెల్లూరు రూరల్ కార్యదర్శి పెంచలప్రసాద్, నేతలు సుధాకర్, నరసింహారెడ్డి, సురేష్, ప్రదీప్, పెంచలయ్య, సంపత్‌కుమార్, లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధునాతన పరికరాలతో కేన్సర్ నిర్ధారణ

నెల్లూరు(అర్బన్): నగరంలోని మెడికవర్ సూపర్ స్పెషాల్టీ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో అత్యాధునిక వైద్య పరికరాలతో కేన్సర్‌ను ఐదు నిమిషాల్లోనే నిర్ధారించి ఆధునిక చికిత్సను అందిస్తున్నామని హాస్పిటల్ న్యూక్లియర్ మెడిసిన్ డాక్టర్ సాయిమౌళిక పేర్కొన్నారు. ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. పెట్ – సీటీ స్కాన్ తమ ఆస్పత్రిలోనే ఉందని చెప్పారు. ఆస్పత్రిలో అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని తెలుగుగంగ సబ్‌స్టేషన్ పరిధిలో రోడ్డు వెడల్పు పనుల దృష్ట్యా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీనగర్, డైకస్‌రోడ్డు, సుభాష్‌చంద్రబోస్‌నగర్, శాంతినగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదు వరకు సరఫరా ఉండదని చెప్పారు.

⇨ ఏకేనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని చంద్రమౌళీనగర్ ఫీడర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కారణంగా చంద్రమౌళీనగర్, గాయత్రినగర్, రిత్విక్ ఎన్‌క్లేవ్, సావిత్రి నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు సరఫరా ఉండదన్నారు.